కార్పొరేట్ హంగులతో సర్కారు ఆస్పత్రి

- అత్యాధునిక వసతులతో పట్టణ ఆరోగ్య కేంద్రం
- టెలిఫోన్ కాలనీలో రూ.80 లక్షలతో నిర్మాణం
- వైద్యుల గది, రోగులకు వెయిటింగ్ హాల్
- అందుబాటులో ల్యాబ్‌లు, మందులు

ఒకప్పుడు ప్రభుత్వాస్పత్రులంటే అరకొర వసతులు, శిథిల భవనాలంటే గుర్తొచ్చేవి. సర్కారు వైద్యం అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేది. కానీ జగనన్న సీఎం అయ్యాక ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రులు అధునాతన హంగులు, అత్యాధునిక సదుపాయాలతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రూపుదిద్దుకున్నాయి.



టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్

చిత్తూరు రూరల్: నగరంలోని టెలిఫోన్ కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రైవేట్ ఆస్పత్రులకు ఏ మాత్రం తీసిపోని రీతిలో నిర్మించారు. రూ.80 లక్షల ప్రభుత్వ నిధులతో అత్యాధునిక వసతులతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.


అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ల్యాబ్

ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది గదులతోపాటు రోగులకు ప్రత్యేక వార్డులు, ఇతర గదులను కార్పొరేట్ వైద్య సదుపాయాలతో నిర్మించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ అద్భుతం

టెలిఫోన్ కాలనీలో నిర్మించిన యూపీహెచ్‌సీ అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.


ఆస్పత్రిలో నిల్వ ఉన్న మందులు, మాత్రలు

ఒక్కప్పుడు ఇక్కడ ఎటువంటి ఆస్పత్రి లేక వైద్యం కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. కానీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా టెలిఫోన్ కాలనీలో యూపీహెచ్‌సీ నిర్మించడంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందుతున్నాయి. అటు వైద్య సిబ్బందికి, ఇటు ప్రజలకు అవసరమైన వసతులను అందుబాటులోకి తెచ్చే విధంగా యూపీహెచ్‌సీ నిర్మాణం చేపట్టారు. వైద్యులకు ప్రత్యేక గదులు, రోగులకు వెయింటింగ్ హాల్, మందులిచ్చే గది, ఆపరేషన్ థియేటర్, స్టాఫ్‌రూమ్, ల్యాబ్, మీటింగ్ రూమ్, రోగుల వార్డు వంటి వాటిని ఇంజినీరింగ్ అధికారులు అద్భుతంగా నిర్మించారు.

ఓపీ వివరాలు		
సోమవారం	:	52
మంగళవారం	:	73
బుధవారం	:	52
గురువారం	:	64
శుక్రవారం	:	56

నిర్వహణ వేళలు

ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణ వైద్య సేవలు అందుబాటులో ఉండగా, ప్రత్యేక వైద్య నిపుణులు వారంలో రెండు రోజులు ఉంటారు. ప్రతి రోజు 50 నుంచి 80 మంది వరకు ఔట్ పేషెంట్లు (ఓపీ) నమోదవుతుంది. ఉచితంగా మందులు, రక్త పరీక్షలు వంటివి ఆస్పత్రిలోనే చేస్తున్నారు. కేంద్రంలో 170 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. 60 రకాల ల్యాబ్ పరీక్షలు చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ 1, స్టాఫ్‌నర్సు 2, ల్యాబ్ టెక్నీషియన్ 1, ఫార్మాసిస్ట్ 1, డేటా ఆపరేటర్ 1, ఎల్‌జీఎస్ 1 చొప్పున పనిచేస్తున్నారు.

రోజు వారీ వైద్య సేవలు ఇలా..

సోమవారం: జనరల్ ఫిజీషియన్, చిన్న పిల్లల వైద్యులు, ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసిజస్)
మంగళవారం: జనరల్ ఫిజీషియన్
బుధవారం: జనరల్ ఫిజీషియన్
గురువారం: జనరల్ ఫిజీషియన్
శుక్రవారం: జనరల్ ఫిజీషియన్, ఆర్థో వైద్య నిపుణులు, ఎన్‌సీడీ
శనివారం: జనరల్ ఫిజీషియన్
ఆదివారం: మధ్యాహ్నం వరకు ఒక స్టాఫ్ నర్సు వస్తున్నారు

ఇంటికి దగ్గర్లో వైద్య సేవలు



టెలిఫోన్ కాలనీలోని హెల్త్ సెంటర్ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంది. దూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లే ఇబ్బందులు తప్పాయి. గంటల కొద్దీ వేచి ఉండి చికిత్స తీసుకోవాలి. పనులు మానుకోవాలి. ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌తో మాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. రద్దీ తక్కువ. వచ్చిన వెంటనే సిబ్బంది స్పందిస్తున్నారు. వైద్యం చేయిస్తున్నారు. సేవలు బాగున్నాయి.
–గుర్రప్పనాయుడు, గంగనపల్లి, చిత్తూరు

వైద్యసేవలు బాగున్నాయి



జ్వరమని ఆస్పత్రికి వచ్చా. గతంలో కంటే వైద్యసేవలు బాగున్నాయి. అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. వైద్య సిబ్బంది రోగులతో ప్రవర్తించే తీరు చాలా బాగుంది. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిపై ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ చాలా బాగుంది. ఇక్కడ అన్ని వసతులు, మాత్రలు, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం వైద్య సేవలు చాలా బాగున్నాయి.
–రషీదా, శంకరయ్యగుంట, చిత్తూరు

క్లుప్తంగా

అయ్యప్పస్వామికి ఇరుముళ్లు


గ్రామంలోని వీధుల్లో ఇరుముడులు తీసుకువెళ్తున్న అయ్యప్ప భక్తులు

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామంలో అయ్యప్పస్వామి ఇరుముళ్లు శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామం మధ్యలో అరటిబోదెలు, అరటిపూలతో అందంగా పడికెట్ల పూజ నిర్వహించి గురుస్వాములు వాసు, సాంబశివం ఆధ్వర్యంలో 34 మంది అయ్యప్ప భక్తులు ఇరుముళ్లతో శబరిమలైకు బయలుదేరారు. గ్రామంలో అన్ని ఇళ్లను మహిళలు శుద్ధంచేసి దీపధూప నైవేద్యంతో అయ్యప్పస్వామిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

ఆశా వర్కర్ల జీతాలు పెంచాలి

చిత్తూరు కలెక్టరేట్: ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చెందమరై కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆ సంఘాల నాయకులు ధర్నా చేశారు. కలెక్టరేట్ ను ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు సుజాత, గీత, దాసరి చంద్ర పాల్గొన్నారు.

అరగొండ పాఠశాల తనిఖీ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ప్రజాప్రతినిధులతో కలసి మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఓటర్ల నమోదుపై తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నమోదుకు వచ్చిన క్లయిమ్స్‌ను పరిశీలించి త్వరితగతిన ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయించి పూర్తి చేయాలని ఆదేశించారు. సీఈఓతో పాటు ఎంఈఓ హేమలత, ఈఓపీఆర్‌డీ హరిప్రసాద్‌రెడ్డి, హెచ్‌ఎం భవనేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడి సాగుతో అధిక ఆదాయం


మామిడి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్

వెదురుకుప్పం: మామిడి మొక్కల పెంపకంతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం పెద్దపోటుచేను గ్రామంలో 2 ఎకరాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సాగు చేస్తున్న మామిడి మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా మామిడి మొక్కల పెంపకానికి నిధులు మంజూరుచేస్తోందని పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి గాను మండలానికి 211 మంది రైతులకు 169 ఎకరాల్లో మామిడి మొక్కలు, 8 ఎకరాల్లో కొబ్బరి మొక్కలు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చినట్టు వివరించారు. మొక్కల సంరక్షణకు మొదటి సంవత్సరానికి రూ.47 వేలు, రెండో ఏడాదికి రూ.27 వేలు, మూడో సంవత్సరానికి రూ.24,890 ఇస్తుందన్నారు. అదేవిధంగా చిన్న, సన్నకారు రైతులను ఉపాధి హామీ కింద నిధులు మంజూరు ఆదుకుంటోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు.

రాజీమార్గమే ఉత్తమం

పలమనేరు: అనవసరమైన పంతాలు, పట్టింపులతో కక్షిదారులు కాలం, ధనం వృథా చేసుకోరాదని, కేసులను రాజీ చేసుకుని మనశ్శాంతిగా జీవించాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక కోర్టులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ సమీపంలోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని, చెక్ బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పుపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. దీనికి తోడు రాజీ అయిన వారికి కోర్టుకు చెల్లించిన ఫీజును కూడా వాపస్ చేస్తామన్నారు. కేసులను రాజీ చేసేందుకు స్థానిక కోర్టులోని పలువురు న్యాయవాదులతో ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

యాదమరి: ప్రస్తుతం వర్షాలు కుస్తున్నందున జ్వరాలపై గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని 180కొత్తపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం గ్రామీణ ప్రజలకు వర్షాల కారణంగా వ్యాపిస్తున్న విష జ్వరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాల కారణంగా గ్రామాలలో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించి నిల్వ ఉన్న నీటిని కిందపోసి ఆరబెట్టాలని సూచించారు. జ్వరాలు సోకితే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీటీ వెంకటరమణ

తవణంపల్లె: మండలంలోని తొడతర, చెర్లోపల్లె గ్రామాల్లో శుక్రవారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. భూ రీసర్వే వెంకటరమణ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు ప్రజలకు ఎన్నికల్లో ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈవీఎంలో ఒక గుర్తుకు ఓటు వేస్తే మరొక గుర్తుకు ఓటు పడుతుందనే అపోహ విడనాడాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ఉండాలని సూచించారు.

చెరువులోకి మురుగునీళ్లా..?


నీళ్లు పెద్ద కాలువలోకి వెళ్లకుండా మట్టిపోసి.. చెరువులోకి వదిలిన దృశ్యం


సచివాలయ సమీపంలో ఆగిపోయిన మురుగునీటి కాలువ నీళ్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల అసంబద్ధ నిర్ణయాలు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. చిత్తూరు పరిసర ప్రాంతాలకు ప్రధాన భూగర్భ జల వనరుగా ఉన్న కట్టమంచి చెరువులోకి గత కొన్ని రోజులుగా కార్పొరేషన్ అధికారులు మురుగునీటి కాలువల నీటిని వదులుతున్నారు. కట్టమంచి, కొంగారెడ్డిపల్లె, హైరోడ్డు, ఆఫీసర్స్ లైన్ ప్రాంతాల్లోని భూగర్భ జలాలు ప్రధానంగా కట్టమంచి చెరువుపై ఆధారపడి ఉంటుంది. వర్షం పడే సమయంలో ఆ నీటిని చెరువులోకి వదిలితే ఎలాంటి ఇబ్బందిలేదు. కానీ కార్పొరేషన్ అధికారులు నిరంతరం మురుగునీటిని చెరువులోకి వదిలేస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందనే కనీస ఆలోచన చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. మరో వైపు మురుగునీళ్లను చెరువులోకి మళ్లించేపుడు నీటి ప్రవాహం ముందుకు వెళ్లకపోవడంతో ఇక్కడే ఉన్న సచివాలయం, సీఎంటీ రోడ్డు, వెంగళరావు కాలనీకు చెందిన కాలువ నీళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయి దోమల ఉత్పత్తి నిలయంగా మారుతోంది. అధికారుల తీరుపై ఇటు ప్రజలు, అటు పర్యావరణ ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయ సర్వీసులకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి, ఆన్‌లైన్‌లో నమోదును పక్కాగా చేయాలని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. శుక్రవారం ఈఈ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డివిజన్ పరిధిలో 12 వేల సర్వీసులు ఉన్నాయని చెప్పారు. వీటిని గతంలో ఆన్‌లైన్ చేశామని అందులో సాంకేతిక కారణాలతో అవి చెల్లుబాటు కాలేదన్నారు. బ్యాంకు ఖాతాదారుల సంతకాల్లో మార్పు, భూ యాజమాన్య హక్కు, భూ తగాదాలు వంటి అంశాల పరంగా సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. దీంతో అలాంటి పొరపాట్లు జరగకుండా ఆన్‌లైన్‌లో రోజు ప్రతి సెక్షన్ పరిధిలో 300 సర్వీసుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఈనెలలోపు మొత్తం వివరాలను ఆన్‌లైన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే కంప్యూటర్ ఆపరేటర్ల సాయం తీసుకోవాలని వివరించారు.

అర్ధగిరికి చేరిన అయోధ్య రాముడి అక్షింతలు


అర్ధగిరి క్షేత్రంలో ఊరేగిస్తున్న అక్షింతలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో అయోధ్యలో శ్రీరామచంద్రుడిని ఆశీర్వదించి ఉంచిన అక్షింతలను శుక్రవారం మండలంలోని 22 పంచాయతీలకు అందజేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, సభ్యులు, బీజేపీ నాయకులు, అర్చకులు అయోధ్య అక్షింతలను తీసుకొని మేళతాళాలతో ఆయలం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అక్షింతలను ప్రతి గ్రామంలోని గుడిలో ఉంచి 15 రోజులపాటు పూజలు చేయించిన తర్వాత ప్రతి ఇంటికీ ఇవ్వాలని సూచించారు.

10న కార్తీక దీపోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని తపోవనం ఆశ్రమంలో ఈ నెల 10, 11 తేదీల్లో కార్తీక దీపోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తపోవనం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గజలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని సుప్రసిద్ధ మహర్షి సద్గురు మలయాల స్వామి తపోవనం ఆశ్రమంలో సాయంత్రం 5 గంటలకు కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీపారాధన తరువాత శ్రీ వ్యాసాశ్రమం వ్యాస పీఠాధిపతులు పరిపూర్ణానందగిరి స్వాముల అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. దీనికి నగరంలోని ప్రజలు విచ్చేయాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం


బహుమతులు అందజేస్తున్న అధికారులు

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు రామానాయక్, గణపతి భవిత కేంద్రం నిర్వహణ, సేవలు, ప్రత్యేక విద్యపై వివరించారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది హేమంత్, దేవేంద్ర, వాణి, బబిత, శాంతకుమారి, ధరణి, స్వప్న, మల్లికార్జున శెట్టి, చిత్రవల్లి తదితరులు పాల్గొన్నారు.

స్థలం కబ్జాపై పరిశీలన

చిత్తూరు రూరల్: చిత్తూరు మండల పరిధిలోని తేనెబండ ప్రాంతంలో కబ్జాకు గురైన వాణిజ్య పన్నుల శాఖ స్థలాన్ని ఆ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి కబ్జాదారులపై చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ స్థలం ఆక్రమణకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దే వైద్యం



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనుష, **ఐరాల:** వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటివద్దే వైద్యసేవలు అందుతున్నాయని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనుష అన్నారు. మండలంలోని చీలాపల్లెలో శుక్రవారం ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరం ఏర్పాటుచేసి ఓపీ సేవలందించారు. 65 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉమామహేశ్వరి, శిరీష, మల్లిక, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వరం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు పేద ప్రజలకు వరం అని, ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ జీవన శైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో అత్యధికంగా రక్తపోటు సంక్రమిస్తోందని, ప్రతి ఒక్కరూ శరీర వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. గర్భిణులు ఆకు కూరలు, కాయగూరలు ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు


మెయిన్ బజారులో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న ఎస్‌ఐ మునస్వామి

యాదమరి: చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ మునస్వామి వాహనదారులను హెచ్చరించారు. యాదమరి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన మునస్వామి శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని మెయిన్ బజారులో పర్యటించారు. వాహనాలు రోడ్డుపైన పార్కింగ్ చేసి ఉండడంతో, వెంటనే ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తన సిబ్బందితో వాటిని అక్కడి నుంచి తీసివేయించారు. వేగంగా నడిపే ద్విచక్రవాహన దారులను ఆపి హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి వాహనాలను వేగంగా నడపడం, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తూ వాహనాలను రోడ్డుపైన ఆపేసిన కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలోని గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా, ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించినా వెంటనే 9440900684కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు మేయర్ అముద తెలిపారు. నగరంలోని గంగనపల్లె సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడారు. తొలుత సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంట్లో జల్లెడ పట్టి మరీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత మన ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో నగర సచివాలయ కన్వీనర్ కిరణ్, కార్పొరేటర్లు పూర్ణ, డివిజన్ ఇన్‌చార్జిలు గుర్రప్ప, శ్రీరాములు నాయకులు మనోహర్‌రెడ్డి, త్యాగరాజులు, ముస్తాక్, అల్తాఫ్, బాలాజీ, ప్రభాకర్, ఢిల్లీబాబు, సుబ్రమణ్యం, గిరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

బంగారుపాళెం: రాష్ట్రంలో పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని నల్లంగాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం సాయంత్రం సర్పంచ్ ధనుంజయరావు అధ్యక్షతన సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఉషా, జెడ్పీటీసీ సోమశేఖర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ భరత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను మరో సారి సీఎంగా చేయాలి

తవణంపల్లె: జగనన్నను మరో సారి సీఎంగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని మండల సచివాలయ హరికృష్ణారెడ్డి కోరారు. మండలంలోని నలిశెట్టిపల్లె సచివాలయంలో శుక్రవారం సచివాలయంలో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రారంభించారు. తెల్లగుండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను వలంటీర్లకు, గృహ సారథులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరమేశ్వర రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, కోదండ, సుకేష్‌రెడ్డి, హరీష్, పూర్ణ, స్వరూప్‌రెడ్డి, తేజారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జగన్‌పాలనతో పేదలకు మేలు

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని మరకాలకుప్పంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించి, అక్కడి ప్రజలకు సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. 2014–19 మధ్య చంద్రబాబు పాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలను, ప్రస్తుతం వైఎస్ జగన్ పాలనను మధ్య తేడాను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, వెంకటేశులురెడ్డి, మనోహర్‌రెడ్డి, రజనీకాంత్, జేఏసీ కన్వీనర్ సాయి, గుండుసాయి, శిలంబరసన్, పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.




బంగారుపాళెం: నల్లంగాడులో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు, తవణంపల్లె: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, చిత్తూరు: జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ అముద

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన


డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరులో రైతులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి వందన అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అదేవిధంగా నానో ఎరువులు వినియోగించడం ద్వారా రవాణా, కూలీల ఖర్చులు తగ్గుతాయని వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. నానో టెక్నాలజీ ద్వారా రూపొందించిన ఎరువులు, యూరియా, డీఏపీని ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తోందని వివరించారు. అనంతరం డ్రోన్‌తో మందుల పిచికారీ చేయడాన్ని చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత తదితరులు పాల్గొన్నారు.